క్లుప్తంగా

వైభవంగా స్నపన తిరుమంజనం



పూజలు అనంతరం ఉత్సవమూర్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన టీటీడీ అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉప్పాడకు కళాభిషేక ప్రశంసాపత్రం



ఉప్పాడ అప్పారావును ప్రశంసాపత్రంతో సత్కరిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ పౌరాణిక నటుడు ఉప్పాడ అప్పారావును కళాభిషేక ప్రశంసాపత్రంతో బుధవారం భీమిలిలో తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ సత్కరించింది. ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్.అంజనప్ప మాట్లాడుతూ అప్పారావు తన ప్రతిభతో ప్రాచీన కళను గౌరవప్రదంగా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పౌరాణిక నటులు సామవేదం బాలసుబ్రహ్మణ్యం, లోకవరపు కృష్ణ, ఎ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీర్‌లెస్ కాలనీ పార్కు ఏరియాలో వీధిదీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ 61 బి7, 61 బి14/1 స్తంభాల వద్ద వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు జోన్ – 2 కార్యాలయం, సచివాలయంలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వీధి దీపాలు వెలిగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

పద్మనాభం : మండలంలోని రేవిడిలో మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో 40 కిలోల గంజాయి పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. రేవిడి పంచాయతీ ఆనందాశ్రమం సమీపంలో రాయల్ ఎన్‌యూ లే అవుట్‌లో గంజాయి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది.

ఆ సమాచారం మేరకు లే అవుట్‌లోకి వెళ్లి వెతగ్గా గంజాయితో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిలో పాడేరుకు చెందిన కిలో అనిల్ కుమార్, విశాఖ ద్వారకానగర్‌కు చెందిన పొట్నూరు వినోద్ వద్ద 40 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి, భీమునిపట్నం కోర్టులో బుధవారం హాజరు పరిచినట్టు పోలీసులు తెలిపారు.

మందుబాబులకు రూ.25 వేల జరిమానా

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న 12 మందిపై పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.2 వేలు వంతున రూ.25 వేల జరిమానా న్యాయమూర్తి విధించారని స్థానిక ట్రాఫిక్ ఎస్‌ఐ వెంకటరావు తెలిపారు.

గంటా భూ ఆక్రమణలు అందరికీ తెలుసు

- ఏ ఊరిలో ఎవరిని అడిగినా చెబుతారు
- చంద్రబాబు మేనిఫెస్టోను ఎవరూ నమ్మడం లేదు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- ఆల్ ఫ్రీ అంటూ ఎన్నికల వేళే చంద్రబాబు కనిపిస్తాడు
- విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి



రామవరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బొత్స ఝాన్సీలక్ష్మిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



రామవరంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి



భీమన్నదొరపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, చిత్రంలో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, సీఈసీ సభ్యుడు శ్రీకాంత్, ఇతర నాయకులు

తగరపువలస : భీమిలి నియోజకవర్గంలోని ఏ ఊరిలో ఎవరిని అడిగినా... చెట్టును అడిగినా... కొండను అడిగినా... టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కబ్జాలు, భూ ఆక్రమణల గురించి చెబుతారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగాలు అమ్ముకుని, బదిలీల పేరుతో డబ్బులు దండుకున్న ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఆనందపురం మండలం కోలవానిపాలెం, రామవరం, భీమందొరపాలెం, కణమాం పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మితో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ చేస్తున్న మంచి పనులు చంద్రబాబుకు నచ్చవన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే సంచులు మోసే ఉద్యోగం, ఆడపిల్లలను ఎత్తుకెళ్లే వలంటీర్లు అంటూ హేళన చేశాడన్నారు. చంద్రబాబు మాటకే విలువ ఉండనప్పుడు ఆయన మేనిఫెస్టోకు ఏం విలువ ఉంటుందన్నారు. ఎన్నికల వేళే ఆయనకు ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. మోసపూరితమైన హామీలు చంద్రబాబు సొంతమన్నారు. ఎన్నికల తర్వాత టీడీపీ నాయకులు ఆయన ఇంటి గేటు కూడా తాకలేరన్నారు. విజయవాడకు చెందిన గంటా అనుచరులు ప్రస్తుతం గ్రామాల్లో తిరుగుతూ కబ్జాకు అనువైన కొండలు, గుట్టల్ని చూసుకుంటున్నారన్నారు. మండలంలో రూ.400 కోట్ల సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. సినిమా డైలాగులు చెప్పడం కాకుండా నిజజీవితంలో ప్రజలకు మంచి చేసే హీరో వైఎస్ జగన్ అన్నారు. కొందరు ప్రలోభాలకు లోబడి గంటా పంచన చేరి బానిసత్వం చేస్తున్నారన్నారు.

ప్రజలంతా జగన్‌నే కోరుకుంటున్నారు

విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడపడుచులకు ఆశాదీపం వైఎస్ జగన్ అన్నారు. ఇంటి గుమ్మం వద్దకే రేషన్, పింఛన్, వైద్యం అందిస్తున్న ముందు చూపు గల ముఖ్యమంత్రి అని కొనియాడారు. అమ్మఒడి, విద్యాదీవెన, సున్నా వడ్డీ తదితర పథకాలతో కూడిన నవరత్నాలను అందిస్తూ అభినవ శ్రీకృష్ణదేవరాయులుగా రాష్ట్రానికి నిలిచారన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌ల ద్వారా రామరాజ్యం నాటి పాలన అందిస్తున్నారన్నారు. రూ.25 లక్షల పరిమితితో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు ఆడపిల్ల పుడితే రూ.25వేలు, ఇంటికో ఉద్యోగం... లేదంటే నిరుద్యోగభృతి, బ్యాంకు రుణాలు మాఫీ అంటూ మోసం చేశాడని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాడన్నారు. ఆల్ ఫ్రీ బాబు పండగ వేషధారిలా ఎన్నికల వేళ వచ్చాడన్నారు. ఉజ్వల భవిష్యత్ కోసం సీఎంగా వైఎస్ జగన్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, పాండ్రంగి శ్రీను, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, బొట్ట రామకృష్ణ, జొన్నల వెంకటరమణ, కోరాడ వెంకట రమణరావు, లెంక రాంబాబు, షిణగం అప్పలరాజు, భాగం సుధాకర్, ఇరోతు అప్పలనాయుడు, ఇరవరపు నరసింహాచార్యులు, గుసిడి ముత్యాలనాయుడు, పాండ్రంగి అప్పారావు, పినిశెట్టి సింహాచలం నాయుడు, జోగ నూకరాజు, గొలగాని పైడిరాజు, గీతల దేవుడు, గొలగాని కృష్ణ, ఎర్ర అప్పలనాయుడు, సియ్యాద్రి పరదేశి, కోరాడ ముసిలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కణమాంలో పువ్వులతో స్వాగతం పలుకుతున్న పంచాయతీ ప్రజలు

వైఎస్సార్ సీపీ వెంటే రెడ్డి, రెడ్డిక ఓటర్లు



బొత్స ఝాన్సీలక్ష్మితో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి

తగరపువలస : రాష్ట్రంలో రెడ్డి, రెడ్డిక సామాజికవర్గ ఓటర్లు అందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంటే ఉన్నారని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని విశాఖపట్నంలో డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డితో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేస్తున్నామన్నారు. మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

15 మంది వలంటీర్లు రాజీనామా



ఎంపీడీవో శైలజకు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

పద్మనాభం: మండలంలోని ఐనాడ సచివాలయ వలంటీర్లు 15 మంది బుధవారం రాజీనామా చేశారు. వీరు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో బి.శైలజకు అందజేశారు. మండలంలో 337 మంది వలంటీర్లకు ఇప్పటి వరకు 154 మంది రాజీనామా చేశారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న నాయకులు శ్రావణ్‌కుమార్ తదితరులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ వాంబేకాలనీకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం సాయంత్రం కార్‌షెడ్ జంక్షన్ వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐ.శ్రావణ్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాలనీలోని పలు బ్లాకులకు చెందిన నామాల శ్రీను, శీరం కనకరాజు, వి.శివ, శ్రీను, ఆటో వెంకటేష్, అప్పియ్యమ్మ, రాములమ్మ, రామలక్ష్మి, చంద్రమ్మ, సత్య తదితర 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వివిధ విభాగాల నాయకులు పీకేఎం పాత్రుడు, పిళ్లా సూరిబాబు, అప్పన్న, పోలారావు, తదితరులు పాల్గొన్నారు.

వుడా లే అవుట్‌లో అనధికార పనులపై ఆందోళన

మధురవాడ: వుడా వేసిన లే అవుట్‌లోకి అనధికార వ్యక్తులు ప్రవేశించారంటూ కొందరు స్థల యజమానులు బుధవారం మధ్యాహ్నం మధురవాడ వుడా హరిత సమీపంలోని స్థలం వద్ద నిరసన తెలిపారు. ఎల్‌పీ నంబర్ 23/2011 ద్వారా లే అవుట్ వేసిన స్థలంలో తాము స్థలాలు కొనుగోలు చేసినట్టు చెప్పారు. అనంతరం వుడాకి, తమకి మధ్య వివాదం నెలకొనడంతో... ఆ వివాదం తేలే వరకు స్థలంలోకి వెళ్లొద్దని వుడా అధికారులు చెప్పినట్టు తెలిపారు. ఈ క్రమంలో 2020లో కొందరు వ్యక్తులు ఆక్రమణకు ప్రయత్నించగా తాము పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల నుంచి కొంత మంది వుడా లే అవుట్‌లోకి వెళ్లి భూమి చదును చేసి, బోరు నిర్మాణం, ఇతర పనులు చేస్తున్నట్టు వాపోయారు. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు పెండింగ్‌లో ఉన్నప్పటికీ తమ స్థలం ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. వుడా, పోలీసు, ఇతర అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఇంతలో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పారు.

ఆర్భాటం, భూకబ్జాలు చేతకాదు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బైక్ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- అభివృద్ధి చేసేందుకే ప్రయత్నిస్తా
- ప్రజలు ప్రశ్నిస్తారని 'గంటా' కారు దిగడం లేదు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: పది కార్లు వేసుకుని వచ్చి... కనిపించిన భూములన్నీ ఆక్రమించి కబ్జాలు చేయడం తనకు చేతకాదని... ఆర్భాటం కన్నా అభివృద్ధికే అధిక ప్రాధాన్యమిస్తామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు పరిధి కొమ్మాది త్రిశక్తి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి బైక్ ర్యాలీతో రిక్షా కాలనీ, కొమ్మాది విలేజ్, ఎస్సీ కాలనీ, అమరావతి నగర్, కె1, కె2, కె3 కాలనీలు, రేవళ్లపాలెం ప్రాంతాల్లో కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంకతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని మేనిఫెస్టోను విడుదల చేసి మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని కోరారు. గతంలో గంటా శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు... కూల్చడాలు, శిలాఫలకాలు, భూ కబ్జాలు తప్ప చేసిన అభివృద్ధి ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. అందుకే ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అని కారు దిగకుండానే వ్యాన్ పైనుంచే చేయి ఊపుతూ గంటా పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధి చూసి ఓటు వేయమని కోరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే అమ్మఒడి ద్వారా రూ.17 వేలు, వైఎస్సార్ చేయూత సాయం రూ.1.50 లక్షలు, వైఎస్సార్ కాపు నేస్తం రూ.1.20 లక్షలు అందుతాయన్నారు. నవరత్న పథకాలు యథావిధిగా కొనసాగాలన్నా, యువతకు ఉపాధి, విద్యా రంగం అభివృద్ధి చెందాలన్నా వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రేవళ్లపాలెంలో రోడ్డు వెడల్పులో పోయిన ఇళ్లకు టీడీఆర్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వస్తే విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందని, పరిపాలనా రాజధానిగా విశాఖ నుంచి పరిపాలన కొనసాగిస్తారన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొట్టా అప్పలరాజు, గాదె రోశిరెడ్డి, సియ్యాద్రి కనకరాజు, పోతిన మూర్తిబాబు, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, పోతిన ఎల్లాజీ, పిల్లా రమణ, బేవర బాబ్జి, వరలక్ష్మి, అవతార్ సింగ్, ఆల్తాఫ్, జాకోబ్, బాబా, గోపి, గుంటుబోయిన శ్రీనివాస్ యాదవ్, జోగారావు, నాగమణి, ఎస్.అప్పలరాజు, కొండమ్మ, వాండ్రాసి సూరప్పరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువ తెలియజేసేందుకు పోస్టర్ ఆవిష్కరణ



భీమిలిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ఓటు విలువ చాటి చెప్పేందుకు పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఓట్ ఫర్ బెటర్ ఫ్యూచర్ పేరుతో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రం బాగుండాలంటే ఓటే ఆయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌ఐ జాతీయ సెక్రటరీ జనరల్ డాక్టర్ పీఎల్‌కే మూర్తి, విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షుడు ఎంకేవీఎల్ నరసింహం, జాతీయ సౌత్ ఉపాధ్యక్షుడు యూఎస్ శర్మ, అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఎండీ శ్రావణ్, పెదబాబు, ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ భీమిలి ప్రెసిడెంట్ గాడు శ్రీను, అక్కరమాని రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు, నాయకులు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వార్డులో స్థానికులకు నాయకులు అందుబాటులో ఉండేందుకు కార్యాలయం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, ముదుండి రాజేశ్వరి, పిల్లా సుజాత, చిల్లా శ్రీనివాసరెడ్డి, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులను ఐక్యం చేయండి



మే డే వేడుకల్లో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

తగరపువలస: అసంఘటిత రంగ కార్మిక వర్గాన్ని ఐక్యపరచాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కోరారు. మే డే సందర్భంగా బుధవారం గుజ్జు రామునాయుడు భవన్ వద్ద మాజీ కౌన్సిలర్ చిల్ల నరసింహులు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అల్లు బాబూరావు, చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, నాయకులు కానూరి రాంబాబు, చిల్ల అప్పలసూరి, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి, మావూరి వీర్రాజు, ఇ.అప్పలనరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మధురవాడ సీపీఐ కార్యాలయం వద్ద కామ్రేడ్ నాగోతి సింగన్న జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వాండ్రాసి రవికుమార్, బెల్లాపు పాపారావు, జగన్‌మోహనరావు పాల్గొన్నారు.

- ఏక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించి పీపుల్స్ అజెండా విడుదల చేసి, ఆ ప్రతులు ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు అందజేస్తామని సంస్థ ప్రతినిధి ఇందు చెప్పారు.
- జీవీఎంసీ 6, 7 వార్డుల పరిధిలోని మున్సిపల్, క్లాప్ డ్రైవర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ద్రోణంరాజు కళ్యాణ మండపం వద్ద కార్మిక జెండా ఆవిష్కరించారు. తర్వాత మజ్జిగ పంపిణీ చేశారు. మిథిలాపురి ఉడా కాలనీలో ఆటో కార్మికులు జెండా ఎగురవేసి జి.చిన్నారావు, ఎర్రయ్య తదితరులు మజ్జిగ పంపిణీ చేశారు. నాయకులు కేఎం కుమార్, అప్పలరాజు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలో చలివేంద్రం వద్ద కార్మిక సంఘాల నాయకులు

ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం



అప్పికొండవీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లింగన్నపేటలో ప్రచారం నిర్వహిస్తున్న కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ సూర్యనారాయణ



మద్ది గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ రాంబాబు, అవనాపు విక్రమ్

భీమునిపట్నం: అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలంటే ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును మరోసారి గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్‌నాయుడు అన్నారు. బుధవారం చిన్నబజారు అప్పికొండవీధి, కాళ్ల వీధి ప్రాంతాల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ఆ పథకాలతో పేదలందరికీ మరింత లబ్ధి చేకూరాలంటే సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. చంద్రబాబునాయుడు సాధ్యం కాని హామీలిచ్చారని..., వాటిని ఎవరూ నమ్మడం లేదన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. నాయకులు బోని సంజీవరావు, సంకురుభుక్త రమేష్, బోని శ్రీను, కొంకి వెంకటేష్, ప్రగడ చంటి, ముకుంద సంతోష్, కాళ్ల సురేష్, తాడివాడ కుమార్ పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం

పద్మనాభం : ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి, భీమునిపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మండలంలోని నాలుగు గ్రామాల్లో బుధవారం రాత్రి విస్తృతంగా ప్రచారం చేశారు. మద్ది గ్రామంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ విజయనగరం నాయకుడు అవనాపు విక్రమ్, బుద్దివలస – అగ్రహారం పంచాయతీ లింగన్నపేటలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ, రెడ్డిపల్లిలో ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఈర్ల ఈశ్వరరావు, బి.ఆర్.తాళ్లవలసలో సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు, కె.మంగారావు ప్రచారం నిర్వహించారు. ఈ ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు వేయాలని అభ్యర్థించారు.



రెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉప సర్పంచ్ ఆదినారాయణ, ఈశ్వరరావు



బి.ఆర్.తాళ్లవలసలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు పైడినాయుడు